క్లుప్తంగా

జావెలిన్ త్రోలో రాష్ట్ర స్థాయికి విద్యార్థి ఎంపిక



గండీడ్‌: విద్యార్థి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న నవీన్ జావెలిన్ త్రోలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ రామునాయక్, ఉపాధ్యాయులు జనార్దన్, శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు కేజీబీవీ విద్యార్థులు



నవాబుపేట: 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నవాబుపేట కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మాధవి, పీఈటీ అర్చనలు తెలిపారు. విద్యార్థులు సిద్దిపేటలో జరిగే పోటీలలో పాల్గొంటారని వారు వివరించారు. ఈ సందర్భంగా గురువారం ఎంపికైన కావ్య, వైష్ణవిలను పాఠశాల బృందం అభినందించారు.

బాస్కెట్ బాల్ టోర్నీకి..

జడ్చర్ల టౌన్‌: నేటి నుంచి సంగారెడ్డి జిల్లాలో జరిగే అండర్ –14 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ రాష్ట్ర టోర్నీకి పట్టణంలోని ప్రేరణ పాఠశాల విద్యార్థులు స్నేహ సుప్రజారెడ్డి, నక్షత్రాతి మాలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోపినాథ్ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరావతి, లక్ష్మణ్, పీఈటీ బాలు ఉన్నారు.

కమిషనర్‌కు సత్కారం

జడ్చర్ల టౌన్‌: జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిని గురువారం ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందించారు. జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధిలో తమవంతు భాగస్వామ్యం అందిస్తామని ఆయన తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో నరేష్‌కుమార్, విష్ణు, వాసు, గోవర్ధన్, సందీప్‌లు ఉన్నారు.

ఆలయానికి ట్యాంక్ వితరణ

జడ్చర్ల టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయానికి గురువారం వాసవీ క్లబ్ వారు నీళ్లట్యాంక్‌ను అందజేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ జగదీశ్‌గుప్త ఆలయ నిర్వాహకుడు గోనెల రాధాకృష్ణకు ట్యాంక్‌ను అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి ప్రదీప్, జిల్లా ఇన్‌చార్జి ప్రవీణ్, వాసవి యన్స్ కందెకృష్ణ, కల్పన, వెంకటేష్, రజితలు పాల్గొన్నారు.

స్కూల్‌కు కుర్చీల వితరణ..

జడ్చర్ల టౌన్‌: మండలంలోని గంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కె.విష్ణువర్ధన్‌రెడ్డి రూ.50వేల విలువగల ఎస్‌టైప్ కుర్చీలను పాఠశాలకు అందజేశారు. మొత్తం 14కుర్చీలను ఆయన పాఠశాలకు అందజేశారు.

మహాసభలను విజయవంతం చేయండి

కోయిల్‌కొండ: 8,9వ తేదీల్లో జడ్చర్లలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సుతారి తిరుమలయ్య తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో హమాలీ కార్మికులతో కలిసి సీపీఎం మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వీరభద్ర హమాలీ సంఘం నాయకులు వేపూరి శ్రీను, సాకలి రాములు, చంద్రయ్య, రాధాకృష్ణ, అక్బర్, నారాయణ, జనార్దన్, పాల్గొన్నారు.

ఏసీబీకి అభినందనలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్‌: డీఈఓ రవీందర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డీఈఓగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు డీఈఓ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంలో, ఆర్జేడీ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఏసీబీ అధికారులు ఫిర్యాదులను స్వీకరించి అవినీతి బయటపెట్టడం గొప్ప విషయమన్నారు.

అవోపా అధ్యక్షుడికి సన్మానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ పట్టణ అవోపా అధ్యక్షుడిగా ఎన్నికైన కె. రాఘవేందర్‌ను తెలంగాణ చౌరస్తా మిత్ర మండలి ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- రాష్ట్రంలో వ్యవసాయం లాభాలబాట పట్టింది
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్/హన్వాడ: రైతుల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన హన్వాడ మండలంలోని బుద్దారం, వేపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో వ్యవసాయం లాభాలబాట పట్టిందన్నారు. రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. వరికొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 48గంటల్లో డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబసర్వేను పరిశీలించారు. లింగన్నపల్లి గ్రామ కాంగ్రెస్ కార్యకర్త తిరుమలయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 52 మంది లబ్ధిదారులకు రూ.16,33,500ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో 150 ఆస్పత్రులు ఉన్నాయని, త్వరలో ఇంకా 100 అదనపు ఆస్పత్రులు ఈ పథకం పరిధిలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అర్హులైనవారు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్దవిజయ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, హన్వాడ మండల అధ్యక్షుడు మహేందర్, ఏఎంసీ డైరెక్టర్లు అచ్చన్న, రామకృష్ణ, వెంకటాద్రి పాల్గొన్నారు.



వేపూర్‌లో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తు న్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

హన్వాడ: మండల కేంద్రంలో నూతనంగా గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈమేరకుఆయన మండల కేంద్రంలోని పండుగ సాయన్న చౌరస్తా వద్ద స్థలాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో గ్రంథాలయ పాత భవనం పోతున్నందున స్థానికులు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో స్థలాన్ని కేటాయించి నూతన భవనం నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రహదారుల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



అడ్డాకుల మండలం వర్నె వాగుపై హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలంలోని వర్నె వాద్ద వాగులో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జిని గురువారం ఆయన ప్రారంభించారు. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి వర్నెవాగు వరకు బీటీరోడ్డు, వాగులో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.18కోట్లు మంజూరు చేసిందన్నారు. రూ.9కోట్లతో వాగులో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాటాడుతూ కురుమూర్తి జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు రావొద్దనే బ్రిడ్జి పనులు పూర్తి చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, తోట శ్రీహరి, నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి

చిన్నచింతకుంట: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. కురుమూర్తి గ్రామంలో ఏర్పాటు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, ఎస్ వెంకటేష్, మహిమూద్, జీజీ పాల్, గంజి బాల్‌రాజు ఉన్నారు.

శాస్త్రీయ విధానాలతో అధిక దిగుబడి సాధించాలి

- డీఏఓ వెంకటేశ్



కోడ్గల్‌లో మొక్కజొన్న విత్తనాలు అందుకున్న రైతులతో అధికారులు

జడ్చర్ల: వ్యవసాయ రంగంలో రోజురోజుకు వస్తున్న నూతన శాస్త్రీయ విధానాలను అవలంబించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోడ్గల్ గ్రామంలో ఇథనాల్ పరిశ్రమల పరివాహక ప్రాంతంలో మొక్కజొన్న ఉత్పత్తిని పెంచే కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ మొక్కజొన్న అధిక ఉత్పత్తి సాధించడానికి పాటించాల్సిన పలు సలహాలు ఇచ్చారు. రైతులను ఎంపిక చేసి 120 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేసేందుకు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని అధిక దిగుబడి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ లుథియానకు చెందిన ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌కే ఝూట్, హైదరాబాద్ పరిశోధన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు సునిల్, నగేశ్, కీటక నివారణ శాస్త్రవేత్త సౌజన్య, పాథాలజీ శాస్త్రవేత్త మల్లయ్య, ఏడీఏ ఆంజనేయులు, ఏఓ గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన..

మహమ్మదాబాద్‌: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి నరేందర్ పరిశీలించారు. ప్రధానంగా వరి, పత్తి, ఆముదం, తదితర పంటలను పర్యవేక్షించి ఆకుముడత, పిల్లనల్లి, తదితర పురుగులు, పంటల తెగుళ్లను పరిశీలించి రైతులకు ముందస్తు చర్యలను రైతులకు వివరించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారులు పవన్, లక్ష్మన్‌లు హాజరై పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మినీ లెదర్‌పార్కుతో ఉపాధి కల్పించాలి



లెదర్ పార్కు భవనం వద్ద చర్మకారుల సంఘం సభ్యులు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో లెదర్‌పార్కును ఏర్పాటు చేసి చర్మకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జడ్చర్ల నియోజకవర్గం చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మాచారం కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇండస్ట్రియల్ పార్కులో శిథిల స్థితిలో ఉన్న లెదర్ పార్కు భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెదర్ పార్కు కోసం 25 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని, మలుపు పేరుతో ఓ భవనాన్ని కూడా నిర్మించారన్నారు. చర్మ ఉత్పత్తుల తయారీకి సంబంధించి చెన్నైలో 250 మంది శిక్షణ పొందారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటు తరువాత లెదర్ పార్కును పట్టించుకోక పోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లెదర్‌పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు బాలయ్య, జంగయ్య, హుస్సేన్, నర్సింహులు, శేఖర్ ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్‌డీఓ నర్సింహులు

హన్వాడ: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఓ నర్సింహులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తపేటలో ఓఎమ్‌ఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజంలో వారికి గుర్తింపు వస్తుందన్నారు. ఇందుకోసం ఓఎమ్‌ఐఎఫ్ సంస్థ వారు మహిళలకు ప్రోత్సాహకంగా ఉచిత కుట్టుశిక్షణా కేంద్ర ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్టూనాయక్, ఓఎమ్‌ఐఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ నారాయణ, మండల కో ఆర్డినేటర్ రాములు, ఎంఎంఎస్ బాలకిష్టమ్మ, బుక్‌కీపర్ ఎల్లప్ప, గ్రామ సంఘం అధ్యక్షురాలు ఇర్ఫానాబేగం, ఓఎమ్‌ఐఎఫ్ గ్రామ సభ్యులు మల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి గంగాబాయి, మాజీ వైఎస్‌ఎంపీపీ దస్తన్న, ఓఎమ్‌ఐఎఫ్ ఆరోగ్య కార్యకర్తలు పద్మ, వసంత, సాయిలమ్మ, రాధ, సుజాత, నాగమ్మ పాల్గొన్నారు.



కొత్తపేటలో కుట్టుశిక్షణ కేంద్రంలో ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఓ నర్సింహులు

యువతి అదృశ్యం

రాజాపూర్‌: యువతి అదృశ్యమైన సంఘటన గురువారం మండలంలోని మోత్కులకుంటతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మోత్కులకుంటతండాకు చెందిన యువతి(18) టైలరింగ్ పనిచేస్తుంది. గురువారం ఉదయం మిషన్ సూది కోసం ప్రైవేట్ స్కూల్‌బస్సులో రాజాపూర్‌కు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు బీమీ, సేవ్యానాయక్ తమ బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

మహ్మదుస్సేన్‌పల్లిలో గేదెల చోరీ

అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లిలో గుర్తు తెలియని దుండగులు నాలుగు గేదెలను ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ముష్టి చెన్నప్పకు రెండు పెద్ద గేదెలు, రెండు చిన్న గేదెలున్నాయి. వాటిని వ్యవసాయ పొలం వద్దనే కట్టేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పొలం వద్ద గేదెలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా గేదెలు కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మూసాపేట ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్దూర్ సంతలో పట్టివేత

మహ్మదుస్సేన్‌పల్లిలో చోరీ చేసిన గేదెలను దొంగలు నారాయణపేట జిల్లా మద్దూర్ సంతకు తీసుకెళ్లి విక్రయానికి పెట్టినట్లు తెలిసింది. అక్కడ వాటిని రూ.30వేలకు విక్రయించగా అందుకు సంబంధించిన చీటీ లేకపోవడంతో అనుమానించిన కొనుగోలుదారులు మద్దూర్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పోలీసులు వెళ్లి దొంగలను పట్టుకున్నట్లు సమాచారం. గేదెలను వాటి యజమానులకు పోలీసులు అప్పగించినట్లు తెలిసింది.

చెకుముకి టాలెంట్ పరీక్ష

జడ్చర్ల టౌన్‌: మండలంలోని గొల్లపల్లి జెడ్పీహైస్కూల్‌లో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. టాలెంట్ పరీక్షను ప్రధానోపాధ్యాయుడు అనంతప్ప ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం జరీనాబేగం, జ్యోతి, షర్మిల పాల్గొన్నారు.

పాఠశాలల్లో కరాటే శిక్షణ ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని పోలీస్‌లైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాలికలకు రాణి లక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం ద్వారా మూడు నెలలపాటు నిర్వహించనున్న కరాటే శిక్షణ ప్రారంభించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కూడా బాలికలకు కరాటే శిక్షణ ప్రారంభించారు. బాలికలకు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ ఇస్తున్నట్లు అధ్యక్షులు, సీనియర్ కరాటే మాస్టర్ ఎతినె చెన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం జయశ్రీ, పీడీ ప్రసన్నకుమార్, కరాటే మాస్టర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టీబీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గండీడ్‌: టీబీ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గండీడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డిపల్లిలో టీబీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీని నియంత్రించడం సులభం అన్నారు. పొగతాగడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ క్యాంపులో 94 మంది నుంచి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరీఫ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి ఉన్నారు.

క్రమ పద్ధతిలో సర్వే నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు

గండీడ్‌: 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సర్వేను క్రమ పద్ధతిలో నిర్వహించాలని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో సర్వేకు సంబంధించిన స్టిక్కరింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లకు స్టిక్కరింగ్ ఏ క్రమపద్ధతిలో వేశారో అదే తరహాలో సర్వే చేయాలన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు ఎన్ని ఇళ్లు కేటాయించారో వాటిని పక్కాగా సర్వే చేయాలన్నారు. ఇచ్చిన అంశాలను జాగ్రత్తగా చదివి ఎలాంటి తప్పొప్పులకు తావివ్వకుండా సమాచారాన్ని పట్టిష్టంగా నమోదు చేయాలన్నారు. ఎంపీడీఓ దేవన్న, సంబంధిత ఎన్యుమరేటర్‌తో ఆయన మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు.

సమగ్ర సర్వేలో తప్పులు రావొద్దు

- అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్
- జిల్లా కేంద్రంలో 27,611 ఇళ్లకు స్టిక్కర్లు

సాక్షి, నెట్‌వర్క్‌: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలోని 49 వార్డులలో రెండోరోజు గురువారం 27,611 ఇళ్లకు ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు అంటించారు. లక్ష్మీనగర్‌కాలనీలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మహబూబ్‌నగర్ అర్బన్ మండల తహసీల్దార్ ఘాన్సీరాం తనిఖీ చేశారు. ఇక జిల్లా కేంద్రంలో గుర్తించిన మొత్తం 78,696 ఇళ్లకు గాను ఇప్పటివరకు 42,956 ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. ఇంకా 35,740 ఇళ్లకు శుక్రవారం వాటిని అంటించనున్నారు.

- సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్ల కుండా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలో జరుగుతున్న సమగ్ర సర్వేను పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లు సమగ్ర సర్వేను తప్పులు లేకుండా గడువులోగా నివేదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిర్పతయ్య, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఛత్రునాయక్ పాల్గొన్నారు.
- దేవరకద్ర మండల కేంద్రంలోని పలు వార్డులో సమగ్ర సర్వే కొనసాగుతున్నది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి యజమాని పేరు, ఇంటి నెంబర్ నమోదు చేసుకుని స్టిక్కర్లను గోడలకు అతికించే కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బల్సుపల్లి, గోపన్‌పల్లి పలు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు సర్వేను నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు పర్యవేక్షణ చేశారు.
- అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో అధికారులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లను అతికించారు. మూసాపేట మండలంలో ఎంపీడీఓ కృష్ణయ్య, అడ్డాకుల మండలంలో ఎంపీడీఓ శ్రీనివాస్ సర్వేను పరిశీలించారు.
- కోయిల్‌కొండ మండలంలోని గ్రామాల్లో పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ కాళప్ప తెలిపారు. మండల కేంద్రంలో సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రమేష్, తదితరులు ఉన్నారు.



మహమ్మదాబాద్‌లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

హాస్టళ్లకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్‌: పీయూ హాస్టళ్లకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు సరఫరా చేయకపోతే వారి కాంట్రాక్టు రద్దు చేస్తామన్నారు. ఇటీవల ప్రారంభిన భవనంలో బాలికలు ఉండేందుకు పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రకిరణ్, నూర్జహన్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేయాలని వినతి

పీయూ పరిధిలో పీజీ పరీక్షలు రెండు, నాలుగు సెమిస్టర్‌లు పూర్తై నెలలు గడుస్తున్నా, ఫలితాలు విడుదల చేయలేదని ఏబీవీపీ నాయకులు రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వివిధ అవకాశాలు వచ్చినా విద్యార్థులు వెళ్లేందుకు ఇబ్బందులు వస్తాయని, వెంటనే ఫలితాలు విడుదల చేయాలని కోరారు.



హాస్టల్‌లో సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

భువనేశ్వర్ బయలుదేరిన పీయూ క్రీడాకారులు..

పీయూ ఆర్చరీ క్రీడాకారులు భువనేశ్వర్‌లో జరిగే సౌత్‌జోన్, ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు బయలుదేరారు. ఈమేరకు అక్కడ సింగల్ మిక్స్‌డ్ విభాగంలో పోటీపడనున్నారు. క్రీడాకారులకు ఎన్టీఆర్ కళాశాల ప్రిన్సిపల్ రాజేందర్‌ప్రసాద్ కిట్లను పంపిణీ చేసి అభినందనలు తెలిపారు.

కంది, వేరుశనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

రాజాపూర్‌: రైతులు తాము సాగు చేసిన కంది, వేరుశనగ పంటలను చీడపురుగుల నుంచి కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోత్కులకుంటతండా, రాజాపూర్‌లో ఆయన క్షేత్రస్థాయిలో కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. కంది పంటలో పూత, కాయ ఏర్పాటు దశలో ఉందని, క్లోరిపైరిపాస్ ఎకరాకు 300 ఎంఎల్ మందు మరియు వేపనూనె 500 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటితో కలిపి పంటపై ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. వేరుశనగలో పొలం ఆరకుండా నీటి తడులు పెడుతూ కలుపునివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఏఈఓలు శ్రీనివాస్, రైతులు వెంకటయ్య, సోమ్లా, తదితరులు ఉన్నారు.



మోత్కుల కుంటతండాలో కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ ప్రదీప్‌గౌడ్

పండుగ సాయన్న విగ్రహ స్థాపనకు భూమిపూజ



వెన్నాచేడ్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు

గండీడ్‌: మండలంలోని వెన్నాచేడ్‌లో పండుగ సాయన్న విగ్రహ స్థాపనకు గురువారం ముదిరాజ్ సంఘం నాయకులు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగల సాయన్న బహుజన బంధువు అని పేర్కొన్నారు. ఎంతో మంది పేదల కడుపు నింపి ఆదుకున్న నాయకుడని ప్రశంసించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, పండగల సాయన్న విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు గువ్వలి వెంకటయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, మత్స్య సహకార సంఘం డైరెక్టర్లు గోపాల్, అంజిలయ్య, రాములు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చిన్నయ్య, నర్సింహులు గౌడ్, పులిందర్‌రెడ్డి, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సాక్షి, నెట్‌వర్క్‌: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గార్లపహాడ్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జి.రవీందర్, వై.విద్యాసాగర్ పాల్గొన్నారు.

- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గండీడ్ మండలంలోని రెడ్డిపల్లి, పగిడ్యాల్, రంగారెడ్డిపల్లి, లింగాయిపల్లి, జక్లపల్లి, జిన్నారంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.
- జడ్చర్ల మండలంలోని కోడ్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డు చైర్ పర్సన్ జ్యోతి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయులు, ఏఓ గోపినాథ్ ఉన్నారు.



రెడ్డిపల్లిలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

‘పట్టాలు తీసుకుని ఇళ్లు ఇవ్వరా?’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎన్నో పోరాటాల ఫలితంగా క్రిస్టియన్‌పల్లిలోని సర్వే నం.523లో 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇంటి పట్టాలిచ్చిందని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ అన్నారు. ఆ తర్వాత తెలంగాణ వచ్చాక 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని తీసుకుని 885 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చినా, ఇంతవరకు నెరవేరలేదన్నారు. గురువారం బాధితులతో సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బాధితులను కాదని వేరే వారికి దివిటిపల్లిలో ఇళ్లు కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11 నెలలైనా సరైన న్యాయం చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామన్నారు. టీఎఫ్‌టీయూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్, ఆయా సంఘాల నాయకులు ఉన్నారు.